## క్లుప్తంగా

### నేడు పెందుర్తిలో సచివాలయ కన్వీనర్ల సమావేశం

సబ్బవరం: పెందుర్తి తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో బుధవారం సచివాలయ కన్వీనర్లతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు సబ్బవరం మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 8.00 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. సచివాలయ కన్వీనర్లు అందరూ విధిగా పాల్గొవాలని ఆయన పిలుపు నిచ్చారు.

### సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలను నిర్వహించారు.

### చలో ఢిల్లీకి తరలిన సీఐటీయూ నాయకులు



చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలివెళ్లిన సీఐటీయూ నాయకులు

పరవాడ: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఐటీయూ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి తాండ్ర మల్లేశ్వరరావు, యూనియన్ ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణ్ తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని నాయకులు డిమాండ్ చేశారు.

### తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం తొలగింపు



విద్యుత్ స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది

పరవాడ: స్థానిక జగన్నాథం వీధిలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని ఈపీడీసీఎల్ సిబ్బంది మంగళవారం తొలగించారు. స్తంభం అడుగు భాగం తుప్పు పట్టి విరిగిపోవడానికి సిద్ధంగా ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విషయాన్ని ఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించారు. పాడైన విద్యుత్ స్తంభాన్ని తొలగించి ఆ స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. పనులను లైన్‌మెన్ బండారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యుత్ శాఖ అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

### వేతన ఒప్పందం అమలుకు డిమాండ్



ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్ మెల్ట్ షాప్ విభాగాధిపతి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవోఐను కార్మికవర్గం ఐక్యంగా వ్యతిరేకించాలని కోరారు. అనంతరం విభాగాధిపతి పి. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, కర్రా ప్రకాశ్, బి. అప్పారావు, మరిడయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



సంబరాలకు హాజరైన మహిళలు

- చంద్రబాబు మహిళలను మోసం చేశారు
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పెందుర్తిలో ఘనంగా ఆసరా సంబరాలు

సింహాచలం: సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని ముఖ్యమంత్రి కాగానే అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి మండలానికి సంబంధించి మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు మంగళవారం పెందుర్తిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ పరిధిలోని 9కోట్ల 4లక్షల రూపాయల చెక్కు, రూరల్ పరిధిలో మహిళలకు 4.70కోట్లు చెక్కు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. పిల్లల చదువులకోసం తల్లుల పేరిటే అమ్మఒడి నగదు, 45–60 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు చేయూత ద్వారా రూ.18,750 అందిస్తున్నామన్నారు.

**మోసం చేయడమే బాబు నైజం**

2014 ఎన్నికల ముందు చంద్రబాబు డ్వాక్రా మహిళలెవరూ ఒక్కరూపాయి కూడా కట్టొద్దని, రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి రుణాలు కట్టకపోవడం వల్ల వడ్డీ మీద వడ్డీ పెరిగిపోయి బ్యాంకుల వాళ్లు పదేపదే వేధించారన్నారు. ఐదేళ్ల పాలన ముగుస్తున్న సమయంలో పదివేలు పసుపుకుంకుమ కింద వేశానని చంద్రబాబు చెప్పగా డ్వాక్రా మహిళలు బ్యాంకులకు వెళ్లి చూసుకున్నారన్నారు. ఆ డబ్బు ఖాతాల్లో చూసుకోవడానికే తప్ప, తీసుకోవడానికి వీల్లేదని బ్యాంకు సిబ్బంది చెప్పిన విషయాన్ని మహిళలంతా గుర్తించుకోవాలన్నారు. కానీ అధికారంలోకి వచ్చాకా డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో మాఫీ చేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చి అమలు చేస్తున్నారన్నారు. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మూడు విడతలు కలిపి రూ. 173.24కోట్లు వైఎస్సార్ ఆసరా పథకం కింద అందించడం జరిగిందన్నారు.

**పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు**

కులం, మతం, పార్టీలు, వర్గాలు చూడకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికల్లో కూడా ఆయన్ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సమావేశంలో 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ దేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, పెందుర్తి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ దేవిసాంబ, నాయకులు నక్క కనకరాజు,గొర్లె రామునాయుడు, ఆదిరెడ్డి మురళి, జోన్–8 ఏపీడీ శ్రీరామ్, రూరల్ ఏపీడీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా జంబో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను గుర్తించి వారి ఇళ్లకే సంక్షేమ పథకాలు అందించే ప్రభుత్వం తమది అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం అట్టహాసంగా చేపట్టారు.వేలాదిగా తరలివచ్చిన డ్వాక్రా మహిళలనుద్దేశించి అదీప్‌రాజ్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో మీరంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదిస్తే నాలుగో విడతలో కూడా రుణాలు మాఫీ చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ అమలు దేశ రాజకీయాల్లో చరిత్ర సృష్టించారన్నారు. లక్షలాది మంది మహిళలకు ఇళ్ల పట్టాలు అందించి వారికి ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సబ్బవరం మండలంలో 14,873 మంది డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా కిందద రూ.13.53 కోట్లు వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. మూడు విడతలు కలిపి రూ.40.58 కోట్లు డాక్రా అక్కచెల్లమ్మలకు ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా జంబో చెక్కు అందజేశారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంపీడీవో రమేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, తహసీల్దార్ బి. సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, నాయకులు పాలిశెట్టి సురేష్ రాజ్, కొటాన రాము, మాజీ ఎంపీపీలు సాలాపు మీన, గొర్లి ఉమామహేశ్వరరావు,బోకం రామునాయుడు, సాలాపు వెంకటేశ్వరరావు,సబ్బవరపు నారాయణమూర్తి,శరగడం రాము, కాపుశెట్టి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



వేలాదిగా తరలివచ్చిన డ్వాక్రా మహిళలు

# సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి



సర్వజన మనోరంజనిపై తిరువీధిలో అప్పన్న



వేణుగోపాలస్వామిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా మనోరంజని వాహనంపై అధిష్టంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారిణుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

# మహిళా పోలీసులకు కళ్లద్దాల పంపిణీ

సీతంపేట: దృష్టి లోపాలతో ఇబ్బంది పడుతున్న 91 మంది మహిళా పోలీస్ సిబ్బందికి కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 8న స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 150 మంది మహిళా పోలీసు నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి మంగళవారం ఉదయం డీసీపీ కార్యాలయంలో కళ్లద్దాలు అందజేశారు. ముఖ్యమంత్రి కంటి కేంద్రం సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ సునీల్ గరుడ్, నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, ఆప్తమాలిక్ ఆఫీసర్లు ఎం.ఉమాశ్రీనివాస్, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

# విశాఖ సాహితి ఆవిర్భావ సభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

సీతంపేట: విశాఖ సాహితి ఆవిర్భావ దినోత్సవ సభ స్థానిక పౌర గ్రంథాలయంలో మంగళవారం జరిగింది. సభకు ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ విశాఖ సాహితి సంస్థ 50 ఏళ్లుగా ఎందరో కవులు, రచయితలను ప్రోత్సహిస్తుందన్నారు. గౌరవ అతిథులు సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, వై.వి.అనూరాధ మాట్లాడుతూ విశాఖ సాహితి సేవలను కొనియాడారు. అనంతరం స్మారక కథల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి గండికోట విశ్వనాథం, డి.వి.సూర్యారావు, కందాళ కనకమహాలక్ష్మి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# నూకాలమ్మ దర్శనానికి భారీగా భక్తులు



పూజలు అందుకున్న నూకాలమ్మ అమ్మవారు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి దర్శనానికి భక్తులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గత నెల 20వ తేదీ నుంచి 23 వరకు అమ్మవారి ఉత్సవాలు జరిగాయి. తర్వాత వచ్చే మంగళవారం మారువారం కావడంతో గత వారం గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీగా భక్తులు తరలివచ్చారు. ఇప్పుడు రెండో వారం కూడా ఎక్కువ మంది భక్తులు దర్శనానికి విచ్చేశారు. కాగా ఆలయం వద్ద భారీ రావిచెట్టు ఉండడం, దాని నీడ అన్నివైపులా పరుచుకుని ఉండడంతో భక్తులు ఎండతో ఇబ్బంది లేకుండా అమ్మవారిని దర్శించుకున్నారు.

**ఘనంగా నూకాలమ్మ మహోత్సవం**

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, సోమన్నపాలెం, గొల్లలపాలెం, రెడ్డిలపాలెం ప్రాంతాల గ్రామదేవత శ్రీ నూకాలమ్మ అమ్మవారి మహోత్సవాలు మంగళవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయా ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# 7 నుంచి 'జగనన్నే మన భవిష్యత్'

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న 'జగనన్నే మన భవిష్యత్' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రసంగించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వారి మనోభావాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. గృహ సారథులు ప్రతి రోజు 5 నుంచి 10 ఇళ్లను ఎంపిక చేసుకొని పార్టీలతో పని లేకుండా జగనన్న నాలుగేళ్ల నుంచి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి పథకాల ద్వారా పొందిన లబ్ధిని లెక్కలతో గుర్తు చేయాలని సూచించారు. గత ప్రభుత్వానికి జగనన్న ప్రభుత్వానికి గల తేడాను వారి నుంచి రాబట్టడానికి గృహ సారథులు కృషి చేయాలన్నారు. నాయకులకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. పరవాడలో వారానికి ఒక రోజు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకు రావడానికి ప్రతి ఒక్కరు శ్రమించాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సమావేశంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.అప్పలరాజు, బి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, అప్పికొండ మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

### సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక : ఈ నెల 15, 16 తేదీల్లో గాజువాకలో నిర్వహించనున్న సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల నుంచి 200 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటున్న ఈ పోటీలను గాజువాకలో నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖలో ఉన్న బాడీ బిల్డర్లందరూ ఈ పోటీలను జయప్రదం చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆనంద్ కుమార్, సురేష్ రెడ్డి, ఢిల్లీ సనపల తదితరులు పాల్గొన్నారు.

### వైభవుని సన్నిధిలో పౌర్ణమి పూజలకు ఏర్పాట్లు



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎస్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం చైత్ర పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. వైభవునికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఉదయం 6.30గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే వారు మంగళాధ్వని, వేదమంత్రోచ్ఛరణతో అభిషేక ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. అనంతరం పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

# ఉక్కు పోరాటం భావితరాలకు మార్గదర్శకం



కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగార పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 782వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు గత వారం ఢిల్లీలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను కలిశామని, ఉక్కు పరిరక్షణకు సహకరించాలని విన్నవించామని తెలిపారు. ఉక్కు పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కూర్మన్నపాలెంలో టెంట్ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 25న సీఎండీ బంగ్లాను ముట్టడిస్తామని, ఈ కార్యక్రమాల్లో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# కోర్టు జోక్యం చేసుకున్నా కొలిక్కిరాని వివాదం

- సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాలలో జేడీ, వార్డెన్ మధ్య వార్



తాళాలు వేసి ఉన్న హాస్టల్ కార్యాలయ గది

తగరపువలస: స్థానిక బైపాస్‌రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర కళాశాలలో ఆ శాఖకు చెందిన జాయింట్ డైరెక్టర్ డీవీ రమణమూర్తి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి కె.నాగార్జున మధ్య వివాదం హైకోర్టు జోక్యం చేసుకున్నా ఇంకా సమసిపోలేదు. అసలే హాస్టల్ వెల్ఫేర్ అధికారుల కొరత కారణంగా ఇన్‌చార్జ్‌లపై పని ఒత్తిడితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జేడీపై విడుదలైన ఒక కరపత్రం... తానే విడుదల చేసినట్టు అనుమానంతో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరి 16న వసతిగృహంలో తనిఖీలు చేపట్టి, 17న సస్పెండ్ చేసినట్టు వార్డెన్ నాగార్జున ఆరోపించారు. నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేయడంతో నాగార్జున హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జేడీ ఆర్డర్‌ను నిలిపివేస్తూ ఆరువారాల్లో నాగార్జునను అదే హాస్టల్‌లో కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు, రీ జాయినింగ్ రిపోర్టును కలెక్టర్ కార్యాలయ సిబ్బంది జేడీ కార్యాలయంలో సమర్పించినా నాగార్జునను ఇప్పటి వరకు విధుల్లోకి తీసుకోలేదు. హాస్టల్‌లో విధులకు హాజరుకావడానికి వెళ్లిన నాగార్జునను ఫేస్ యాప్ నుంచి తొలగించడమే కాకుండా ఇన్‌చార్జి వార్డెన్ సత్యనారాయణ స్టోర్‌రూం తాళాలు ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించనున్నట్టు వార్డెన్ నాగార్జున తెలిపారు.

# పోలమాంబ.. పాహిమాం

- వైభవంగా శ్రీకరకచెట్టు పోలమాంబ మహోత్సవం
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో క్యూలైన్లలో వేచి చూస్తున్న భక్తులు



వివిధ వేషధారణల్లో విన్యాసాలు

ఏయూ క్యాంపస్ : శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మ వారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మద్దివానివీధిలోని పెద్దిల్లు నుంచి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి పోలమాంబ ఆలయంలో అధిష్టంపజేసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. సోమవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టుపక్కల 14 గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం నుంచి పోలమాంబ ఆలయానికి వెళ్లే మార్గం సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొంత మంది ఘటాలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఆట వస్తువులు, చెరకుగడలు, బొమ్మల విక్రయ స్టాళ్లు ఏర్పాటు చేశారు.

**అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు**

పోలమాంబ అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
7997958341, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com